ప్రేమ స్వరూపులారా!

దేహములు అంగవిహీనముగా కన్పించవచ్చుగానీ ఆత్మకు ఎట్టి అంగము లేదు. అది ఎప్పుడూ హీనము కాదు. ఆత్మ నిరంతరమూ సంచలనమై, పవిత్రమై దయ పరోపకార సంబంధమైన కార్యములలో పాల్గొంటుంది.

అన్నదానము కన్న అధిక దానంబేది
తల్లిదండ్రుల కన్న దైవమేది
జపతపంబుల కన్న సత్యశీలంబేది
దయ కంటె నెక్కువ ధర్మమేది
సుజన సంగతి కన్న చూడ లాభంబేది
క్రోధంబు కంటె శత్రుత్వమేది
ఋణము కంటె  శత్రుత్వమేది
ధరణి నపకీర్తి కంటెను మరణమేది
సర్వదా కీర్తి కంటెను సంపదేది
స్మరణ కంటెను మించు నాభరణమేది!

ముఖ్యముగా అంగహీనమైనవారు, 'మాకు అంగములేకపోయిందే మేము పనులు చేయలేకపోయామే, మాకు యీ పరిస్థితి వచ్చిందే' అని వగచనక్కరలేదు. ఎందుకు? ఇది దేశమునకు ఒకవిధమైన ఆదర్శము నందించే ప్రయత్నమే. మీకు అంగములు లేకపోయినప్పటికీ, మీకు చేతనైన పనులు మీరు చేసి అంగహీనము కాని వారికి కొంచెం బుద్ధి చెప్పాలి. అంగములున్నవారు ఏమి చేస్తున్నారు? చెడ్డ పనులు చేస్తున్నారు. దుర్మార్గములో ప్రవేశిస్తున్నారు, దుర్గుణాల్లో ప్రవేశిస్తున్నారు, దుస్సంగములో చేరుతున్నారు. కానీ మీకట్టి దుస్సంగము, దుష్ప్రవర్తన, దురాలోచనలు రావటానికి అవకాశమే లేదు. నిజముగా మీరెంతో అదృష్టవంతులనే చెప్పవచ్చు.అంగములు కలిగిన వారు చెడు ప్రవర్తనలో సంచరిస్తుంటారు. మాకు యీ విధమైన పరిస్థితి యిచ్చాడని భగవంతునికి ఎంతో కృతజ్ఞత చెప్పుకోవాలనే రీతిలో మీరు నిరంతరము ప్రార్థన చేస్తూ రావాలి. అంగములున్న వారికి, అంగములు లేని వారికి వ్యత్యాసము ఎక్కువ లేదు. అంగహీనులైన వారు కొన్ని ఉపకార కార్యములు చేయలేకపోవచ్చును. కానీ అంగములు కలిగినవారు ఎంతవరకు చేస్తున్నారు ఉపకారములు? ఏమీ చేయటం లేదు. కానీ అంతోయింతో మన సత్యసాయి కళాశాలలో చదివినవారు, పనిచేసే టీచర్సు, చదివే విద్యర్థులు యెంతయో దయతో, ప్రేమతో యీ అంగవిహీనులైన వారిని దగ్గరకు చేర్చి వారికి చాలా ఉపకారములు చేస్తున్నారు. ఇది నాకు చాలా సంతోషము. ఇంతే కాకుండా ఒకటిరెండు రోజులు వారికి ఉపకారము చేసినంత మాత్రమున చాలదు. చాలామంది పిల్లలను చూస్తున్నాను. వారు కొన్ని ఉపకార కార్యక్రమాలు చేస్తున్నారు. కొన్ని మిషన్లు యిస్తున్నారు. కానీ అవి ఎంతకాలము పనిచేస్తాయి. కానీ వారి జీవితమంతా వాటిపై ఆధారపడి ఉంటున్నాది. కనుక వారికి ఉపకారమైన అంగములు పనిచేయలేని పరిస్థితిలో వాటిని సరిచేయించి అందించటానికి మా కాలేజీ పిల్లలు సంసిద్ధులై ఉండాలి. ఈ యిచ్చిన వస్తువులు పనిచేయనప్పుడు వాటిని సరిచేసి సమయానికి అందించటానికి ప్రయత్నము చేయాలని నేను ఆశిస్తున్నాను. మీరు అప్పుడప్పుడు వచ్చి కోరటమంటే చేతకాదు. నా ఉద్దేశ్యము యేమంటే యీ ఉపకారము చేసేవారి పేరుతో పది లక్షలు యిచ్చి (చెడినవి బాగుచేసి సరిచేయటానికి) సహాయము చేసి వారికి జీవితములో ఎట్టి కొరతా రాకుండా, నిత్య జీవితములో ఆదర్శము నందించాలని నేను ఆశిస్తున్నాను. అంగములు అందరికీ ఉన్నాయి. కానీ అవి చేయవలసిన మంచి కార్యములు చేయటం లేదు. ఈ అంగముల చేత  దుష్ప్రవర్తనలు, దురాలోచనలు, దుర్గుణాల్లో ప్రవేశిస్తున్నారు. కనుక, అంగములు గొప్పవని మీరు భావించకండి. అంగములు లేనివారి కంటె అంగములు ఉన్నవారే ఎక్కువ పాపాలు చేస్తున్నారు. వారికి తగిన సహాయము వారికి ఉండికూడను, అలక్ష్యముచేసి, అశ్రద్ధచేత పిల్లలకు కొన్ని కష్టములు కలిగిస్తున్నారు.

ఈ పిల్లలను కన్న తల్లిదండ్రులు ఎంత దుఃఖిస్తూ ఉంటారో పాపం. ఈ పిల్లలు కలిగినందుకు వారు విచారపడుతుంటారు. అయ్యో! మా పిల్లలు పదిమందితో పాటు నడవలేకపోతున్నారే అని ఒక చింత. పెండ్లి, పేరంటము యింకా కాలేదే, వారిని ఎవరు చూసుకుంటారు, యీ అంగహీనులైన వారి గతి ఏమిటని చాలా బాధపడుతుంటారు. అలాంటి పరిస్థితిలో తల్లిదండ్రులకు యేమాత్రము కష్టము కలిగించకుండా యీ అంగహీనమైన పిల్లలు వారికి తగిన సేవలు చేయాలి.

మీరు తల్లిదండ్రుల సేవ చేస్తుంటే దైవానికి సేవ చేస్తున్నట్టుగా ఉంటుంది. కనుక, మీరు తల్లిదండ్రులను యేమాత్రము విచారపడకుండా సాధ్యమైనంతవరకు వారిని సంతోషపెట్టటానికి తగిన మాటలు చెప్పో, తగిన పనులు చేసో వారిని తృప్తిపర్చటానికి తగిన ప్రయత్నము చేయాలి. అంగములున్నాయి. ఉండి ఏమి ప్రయోజనము? చేతులున్నాయి. చేత్తో ఎన్ని పనులైనా చేయవచ్చును. మంచి పనులూ చేయవచ్చు, చెడ్డ పనులూ చేయవచ్చు. కన్నులున్నాయి. కన్నులున్నవారు మంచినీ చూడవచ్చు, చెడ్డనూ చూడవచ్చు. బుద్ధి ఉన్నవారు మంచినీ యోచన చేయవచ్చు, చెడ్డనూ యోచన చేయవచ్చు. కాబట్టి, బుద్ధి, అంగములు ఉన్నవారు మేధావులని మీరు భావించకండి. ఎంతో మేధాశక్తి ఉండి కూడను దానిని దుర్వినియోగ పర్చుకునే దుర్మార్గులు ఎంతమందో ఉంటున్నారు. వారికంటె మీ అంగములు లేనివారు అంతోయింతో ఉపయోగపడే కార్యాలు చేస్తూ, భగవచ్చింతన చేసుకుంటూ వారికి తగిన ఆదర్శమునందించాలని నేను ఆశిస్తున్నాను.

మా అనంతపురం టీచర్సు యిలాంటి పనులు అప్పుడప్పుడు చేస్తూనే ఉన్నారు. మనం యిచ్చినవి కొన్ని చెడిపోతూ ఉంటాయి. కొన్ని సరిగా ఉండవు. వాటిని చక్కచేయించి ఎప్పటికప్పుడు చూసుకోవాలి. ఇచ్చినాము కదాయని ఊరికే ఉండకూడదు. మేము యిచ్చిన వస్తువులు పనిచేస్తున్నాయా లేదా, వస్తువులు ఉపయోగపడుతున్నాయా లేదా అని మీరు విచారించాలి. ఇది మీ బాధ్యత. దీనిని మీరు దృష్టిలో పెట్టుకొని ఆదివారము, సెలవు దినములలో వీరి దగ్గరకు పోయి యిచ్చిన అంగములు యేవిధముగా పనిచేస్తున్నాయి, వారు మంచిగా నడచుకుంటున్నారా అని హెచ్చరిస్తూ వారికి ఉత్సాహప్రోత్సాహములు యివ్వాలని నేను ఆశిస్తున్నాను. తల్లిదండ్రులకంటె బయటివారే యెంతో సహాయము చేస్తున్నారు. తల్లిదండ్రులకు శక్తికూడా లేకుండా ఉంటున్నాది. వారు శక్తిహీనులై ఉంటారు. మన విద్యార్థులు, మన టీచర్సు కేవలం యీ పిల్లలను మాత్రమే కాదు ఆ తల్లిదండ్రులకు ఉత్సాహప్రోత్సాహములనందించి వారికి తగిన ఆనందమునందించాలి. పిల్లలకు యిండ్లు లేవు. ఇండ్లు లేకుండా పోవటం వలన బజార్లో తిరుగుతూ, భిక్షమెత్తుకుంటూ, యిచ్చిన వస్తువులను అమ్ముకొని వారు యేమీలేని స్థితిలో ఉంటున్నారు. అలాంటివారి తల్లిదండ్రులు యెవరైనా వస్తే అంతోయింతో సహాయముచేసి యిండ్లుకూడా కట్టించటానికి సిద్ధముగా ఉంటున్నాను. వస్తువులు యిచ్చినంత మాత్రమున సద్వినియోగము చేసుకునే శక్తి ఆ పిల్లలకు లేకపోవచ్చు. కొంతవరకు మన టీచర్సు బాధ్యత తీసుకోవాలి. సరిచేయటానికి తగిన మూల్యం నేనందిస్తాను. వారు భవిష్యత్తులో ఎలా అభివృద్ధికి వస్తున్నారనేది మీరు చక్కగా గుర్తించి వర్తించాలి. ఈ విధముగా గుర్తించినప్పుడే సేవ సార్థకమౌతుందిగానీ ఏదో పుట్టపర్తికి పిల్చి యిచ్చినాము అని అనుకున్నంత మాత్రమున చాలదు. జీవితమంతా బాధ్యత తీసుకోవాలి. వారిని విచారించి,'నాయనా! యిచ్చిన వస్తువులు ఏవిధంగా పనిచేస్తున్నాయి? మీరు దుర్వినియోగ పర్చుకోవద్దు' అని చెప్పి వారి ఉత్సాహమును అభివృద్ధి పరచి వారికి తోడ్పాటు మీరు చేయాలి. అదే నేను కోరేది. ప్రపంచములో ఉపకారము చేస్తున్నారు, దానధర్మాలు చేస్తున్నారు. దయతో చూస్తున్నారు. కానీ దానధర్మాలు చేసినంత మాత్రమున చాలదు. దానము, ధర్మము తాత్కాలికముగా వినియోగించుకోవచ్చును. జీవితమునకంతా శాశ్వతమైన దయ అనేది మీరు పెట్టుకొని ఆ పిల్లలను అభివృద్ధి పర్చుకుంటూ రావాలి.

నాయనా! చదువు లేని పిల్లలు చదువుకోండి. మంచిది బంగారు. అంగములున్నవారికంటె మీరే

అదృష్టవంతులు. చదువుకోండి. ఏమైనా అనానుకూలములుంటే తప్పక నన్ను అడగండి. ఇస్తాను. చాలామంది చదువుకొన్నవారు, యేమి చేస్తున్నారంటే, గొప్ప చదువరులమనుకొని తమను తాము మరచిపోతున్నారు. అహంకారముతో గుణములనే మర్చిపోతున్నారు. మీరు చదువుకొని, కొంతవరకు శక్తిని సంపాయించుకొని సద్వినియోగము చేసుకుంటూరావాలి బంగారు. ఆవిధంగా ఉండినప్పుడే చదువుకొన్నందుకు సార్థకమౌతుంది. చదువు చదివినంత మాత్రమున చాలదు.

చదువులన్ని చదివి చాల వివేకియై
మదిని తన్నెరుగడు మందమతుడు
ఎంత చదువు చదివి యేరీతినున్నను
హీనుడవగుణంబు మానలేడు.
అడవులయందున్న ఆకసముననున్న
పట్టణముననున్న పల్లెనున్న
గుట్టమీదనున్న నట్టేటబడియున్న
దిక్కులేని వానికి దేవుడే దిక్కు.

అలాంటి దేవుని మనం మరువకుండా దినమూ ఉదయము, సాయంత్రము, పడుకునేసమయంలో మీ పనులు పూర్తయిన తరువాత ఒక్కతూరి భగవంతునికి అర్పితము చేసి, 'స్వామీ! ఏదో మా చేతనైనంత సేవ చేశాము. ఈ చేతనైనంత సేవను సార్థకం గావించండి' అని భగవంతునికి అర్పితము చేసి మీరు నిద్రించండి. లేచి తక్షణమే మీరు చేయవలసినది ఏమిటి? తెల్లవారితే యిది చేయాలి అది చేయాలి అని అనుకోటం కాదు.
'భగవంతుడా! సార్థకమయ్యే పనులు మాతో చేయించి మాకు మీరు సహాయము చేయండి' అని భగవంతుని ప్రార్థించండి. తప్పక భగవంతుడు అనుగ్రహించి, ఆనందించి అన్ని శక్తులు, సామర్థ్యములు తానే అనుగ్రహిస్తాడు. కనుక, భగవంతుని మాత్రం మరువకండి. దేనినైనా మరువవచ్చు కానీ భగవంతుని మరువకండి. భగవంతుడే అన్నివిధాలా మనలను రక్షించేది. భగవంతుడే సాక్షి. ఇంటనే, కంటనే, వెంటనే ఉండి భగవంతుడు కాపాడుతుంటాడు కనుక భగవంతుని ప్రార్థించండి. అంగములు హీనమైనాయని ఆ ద్వేషముతో భగవంతుని మీరి దూషించకండి. ఏదో కోపం వస్తుంది. కోపం వచ్చినప్పుడు దూషించవచ్చు కానీ భగవంతుని మాత్రం దూషించ కూడదు. ఏ కష్టము వచ్చినా మిమ్మల్ని మీరైనా దూషించుకోవచ్చు కానీ భగవంతుని మాత్రం దూషించ కూడదు. ప్రేమించాలి. భగవంతునికి ప్రేమయే ప్రధానమైనది. భగవంతునిపై ప్రేమ యీనాడు లోకములో తగ్గిపోయింది. అందులనే జనము చాలా కష్ట పరిస్థితులకు గురౌతున్నారు. భగవంతునిపై ప్రేమ ఉంటుండాలి. బీదలను చూస్తే జాలి ఉండాలి. జాలి, ప్రేమ యీ రెండూ ఉంటుంటే మనకంటే అదృష్టవంతులు యింకోరు లేరు. మనకు కోట్ల కొలది ధనము ఉండవచ్చును. భవనములు ఉండవచ్చును. దైవము యొక్క అనుగ్రహమే లేకపోతే యిన్ని ఉండి ప్రయోజనము ఏమిటి? అన్నీ వ్యర్థమే. కనక, దైవము యొక్క అనుగ్రహము పొందటానికి తగిన ప్రార్థన చేసి, శక్తి కొలది మీరు సేవలు చేస్తూరండి బంగారు.

జయమ్మ, యీ కళాశాల టీచర్సు యీ చదువులు చదివినందుకు, ఆ చదువులు సద్వినియోగ పర్చుకుంటూ యిలాంటి సమావేశములు కల్పించి తగిన సేవలు మధ్యమధ్య అందించాలని ఆశిస్తున్నాను. నిజంగా మీరు నేర్చిన విద్య యీ సేవలకోసమే. సేవయే ముఖ్యమైనది. సేవకంటె మించినది మరొకటి లేదు. సేవకు మించిన ధనము ఎక్కడ కూడను లేదు. సేవయే ప్రధానమైన ధనము. దీనిని దృష్టిలో పెట్టుకొని వారిని అప్పుడప్పుడు కలుసుకొని, వారినే రమ్మని చెప్పకూడదు. మనమే పోవాలి. 'మీరంతా బాగున్నారా? ఎట్లా ఉన్నారు?' అని అడిగితే వారికి

ఎంతనో ఉత్సాహము కలుగుతుంది. వారిని ఆనంద పరచే మాటలను వారితో మాట్లాడి, ఆనంద పరచే మార్గాన్ని నిరూపించి వారికి సేవలు చేస్తూరండి. సేవకు మించినది మరొటి లేదు. సేవయే ప్రధానమైనది. సేవయే అన్ని విధాలా ధన్యమైనది. సేవయే మానవునికి ధైర్యమునిచ్చేది. సేవయే దేవుని సమీపానికి తీసుకొని పోయేది. ది బెస్ట్ వే టు లవ్ గాడ్ ఈజ్ టు లవ్ ఆల్ అండ్ సర్వు సార్థకము గావించుకోటానికి నామము, జపము, తపము యిలాంటివి చేసి ప్రయోజనము లేదు. దిక్కులేనివారికి తగిన సహాయము చేయటానికి ప్రయత్నం చేయాలి. అంతకంటె మించిన సేవ లేదు బంగారు. ఈ విధంగా ఉండేవారిని దగ్గర చేర్చి తగిన ఉపకారము చేసి వారికి తగిన ఆనందము నందించండి. ఆ ఆనందములో మీరుకూడా భాగము వహించి, ఆ ఆనందము యిద్దరూ భుజించి సంతోషంగా జీవితాన్ని సార్థకముగావించుకోవాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

మీకు తెలుసు బంగారు. ఇక్కడ దీనజనోద్ధరణ అని తల్లి తండ్రి లేని పిల్లలను 65 మందిని చేర్చుకున్నాము. వారికి ఏవిధంగా చేస్తున్నాం? వారికి తినండి అని భోజనము పెట్టేది కాదు. వారిచేత పనిచేయిస్తూ, విద్య నేర్పిస్తూ, ఒక్కొక్కని పేర ఒక్కోక్క లక్ష రూపాయలు ఫిక్సెడ్ డిపోజిట్ కట్టించాను. పెద్దలైన తరువాత పెండ్లిపేరంటము చేసుకొని స్వతంత్రముగా జీవించటానికి వెళ్లేటప్పుడు ఆ లక్ష రూపాయలు వాడే తీసుకోవచ్చు. ఆ యిల్లు కూడా యిచ్చేస్తాం. చేయవలసిన సహాయము శాశ్వతమైనది చేయాలి. అప్పటికప్పుడు జరిగిపోయేదికాదు చేయవలసినది. ఉండటానికి యిల్లుఉండాలి. తినటానికి తిండి ఉండాలి కట్టటానికి బట్ట ఉండాలి. అంగములు సరిగా ఉండాలి. ఇచ్చిన అంగములు సార్థకం గావించుకోటానికి తగిన ఉపకారం చేయండి. అదే పెద్ద సేవ. ఇంతకుమించిన సేవ నేను కోరటం లేదు. ఏవిధమైన ఆస్థిపాస్థులు నేను కోరటం లేదు. దిక్కులేని వారిని దగ్గర తీసి, ప్రేమించి, ధైర్యమాటలు బోధించి వారిని ఉత్సాహపరచాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ విరమిస్తున్నాను.

ఆడవారు, మగవారు మీరందరూ క్యాంటీను దగ్గరపోయి కడుపునిండు భోజనము చేసి సంతోషంగా వెనక్కిపొండి బంగారు. నేను దయతో చూసుకుంటాను. భోజనాలు అక్కడ అందరికీ ఏర్పాటు చేశాను. భోజనము చేసి పొండి బంగారు.

(2003 నవంబరు 12వ తేదీ సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)